క్లుప్తంగా

అర్హులకు రేషన్ కార్డులను అందించాలి

ఉంగుటూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు అందించాలనేది కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గురువారం ఉంగుటూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలతో ఎమ్మెల్యే ధర్మరాజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ రెండు సంవత్సరాల ఆరు నెలలు తరువాత కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉంగుటూరు ఎంపీడీఓ రాజ్‌మనోజ్, తహసీల్దార్ రవికుమార్, గణపవరం తహసీల్దార్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



చిన్నారులకు బొమ్మలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సునీల్ రాజశేఖర్

దెందులూరు: మండలంలోని చల్ల చింతలపూడి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పెదపాడు ప్రాజెక్ట్ సీడీపీఓ డాక్టర్ సునీల్ రాజశేఖర్ గురువారం తనిఖీ చేశారు. రికార్డులు ఆహార పదార్థాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ చిన్నారులతో మాట్లాడి ఆహార పదార్థాలు విద్యాబోధన మౌలిక వసతులు కల్పనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో దెందులూరు సెక్టార్ సూపర్‌వైజర్ చిట్టెమ్మ, అంగన్‌వాడీ ఆయా సౌమ్య తదితరులు ఉన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



దెందులూరు ఎంపీడీఓ కే.శ్రీదేవి

దెందులూరు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని దెందులూరు ఎంపీడీఓ కే శ్రీదేవి అన్నారు. గురువారం దెందులూరు ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతూ నెల రోజులు పాటు అన్ని గ్రామాల్లో యోగా కార్యక్రమం జరుగుతుందన్నారు. మండలానికి ఇద్దరు మాస్టర్ ట్రైనర్స్ చొప్పున సచివాలయంకి ఏడుగురు చొప్పున మండలంలో 200 మంది ఉంటారన్నారు. మారుతున్న ఆహారపు అలవాట్లు తీరికలేని దయనందిత జీవితంలో ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటూ సమయం కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి గ్రామ సచివాలయంలో యోగా నేర్చుకునే వారికి నమోదు చేసుకోవడానికి ఆన్‌లైన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఇప్పటికీ గ్రామాల్లో యోగాంధ్ర సర్వే దాదాపు పూర్తికా వచ్చిందన్నారు. ఉపాధ్యాయులు స్వచ్ఛంద సంస్థలు మేధావులు గ్రామగ్రామాన ప్రజలు యోగలో శిక్షణ పొందేందుకు తమ వంతు సహాయ సహకారాలు ప్రోత్సాహాన్ని అందజేయాలని ఎంపీడీఓ తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన



ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో చేబ్రోలులో బుర్రకథ ద్వారా ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. ఏఆర్‌టీ మందులు, పీపీ టీసీ కేంద్రాలు, మొబైల్ ఐసీటీసీ కేంద్రాలు, రక్తదానం, హెచ్ఐవీ 2017 యాక్ట్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఏలూరుకు చెందిన కీర్తన కల్చరల్ సొసైటీ కళాకారులు వీధి నాటిక వేశారు. కార్యక్రమంలో ఎ.తిరుపతి కుమార్, వి.సుబ్బారావు, ఎం.శ్రీదివ్య వి.వాణి తదితరులు పాల్గొన్నారు.

27న భీమడోలులో జాబ్‌మేళా

ఉంగుటూరు: యువత భవితకు ఉపయోగపడే జాబ్‌మేళాను యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కోరారు. గురువారం ఉంగుటూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాబ్‌మేళా పోస్టరును ధర్మరాజు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్తంగా 27న భీమడోలు గీతాంజలి డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జాబ్‌మేళాకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 818488 7146, 77101 77767 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు: మండలంలోని రావులపర్రు, సీతారామపురం, రాచూరు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీఈ అంబేడ్కర్ తెలిపారడ్కీ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదలు చేశారు. నిడమర్రు ఫీడరు మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని స్పష్టం చేశారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చిరుద్యోగులపై బాబు మార్క్ కత్తి

- ఇంటింటికీ రేషన్ పథకానికి మంగళం
- రోడ్డున పడిన 100 మంది ఎండీయూలు, సహాయకులు
- న్యాయ పోరాటానికి సిద్ధమంటున్న ఆపరేటర్లు



ఎండీయూ వాహనం వద్ద నుంచి సరుకులు తీసుకుంటున్న లబ్ధిదారులు



బువ్వనపల్లిలో రేషన్ బియ్యం ఇంటికి తీసుకెళ్తున్న లబ్ధిదారులు(ఫైల్)

నిడమర్రు: పౌరసరఫరాల శాఖ ద్వారా నిత్యావసరాలను పొందుతున్న పేదలు మళ్లీ కష్టాలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చేస్తోంది. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో 2019 ముందు రోజులు పునరావృతం కానున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎండీయూ వాహనాలతో ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించగా ప్రస్తుతం ఆ పథకానికి చంద్రబాబు సర్కారు మంగళంపాడింది. ఇప్పుడు మళ్లీ గతంలో మాదిరిగా చౌకడిపోల వద్దే పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించడంతో కిలోమీటర్లు దూరం వెళ్లి, గంటల తరబడి రోడ్లపై నిరీక్షించాల్సి వస్తుందని రేషన్ లబ్ధిదారులు వాపోతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదల ఇంటి ముంగిటకే నిత్యావసరాల పంపిణీ చేయడంతో ఆ పథకానికి మంచి ఆదరణ లభించింది. ఏ ఇబ్బంది లేకుండా ప్రతీ నెలా కుయ్.. కుయ్ అంటూ ఉదయం 7 గంటలకే ఇంటి ముందుకు ఎండీయూ వాహనం వచ్చి సరుకులు అందించేది. ఇక ఎండీయూ (మొబైల్ డిస్పర్స్‌మెంట్ యూనిట్) సేవలు అమలు చేయబోమని పౌరసరఫరాల శాఖా మంత్రి నాదేండ్ల మనోహర్ ప్రకటించడంపై పేదలు పెదవివిరుస్తున్నారు. గతంలో పడిన కష్టాలు మళ్లీ తమ ముందు కనిపిస్తున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే నెల నుంచి కిలో మీటర్ల దూరం వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సి వస్తుందని దీని వల్ల ఒక రోజు ఉపాధి కోల్పోవడమే కాక చౌకడిపోల వద్ద క్యూ కట్టి పడిగాపులు తప్పవని లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

బాబు వస్తే.. జాబులు ఊడుతున్నాయ్

బాబు వస్తే జాబు అంటూ కూటమి నేతలు నిరుద్యోగులను మభ్యపెట్టారు. అధికారంలో వచ్చాక జాబు బాట ఎలా ఉన్నా.. ఉన్న ఉద్యోగాల్లోంచి బలవంతంగా తొలగించే ప్రక్రియ ప్రారంభించారంటూ నిరుద్యోగులు ఆవేదన చెందుతున్నారు. అధికారంలో వచ్చిన వెంటనే వలంటీరు వ్యవస్థను, ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చెయ్యడంతో చిరుద్యోగులుగా ఉన్న వందలాది మంది రోడ్డున పడి నిరుద్యోగులుగా మిగిలారు. దీంతో వారంతా ఒకేసారి ఉపాధి కోల్పోయారు. తాజాగా ఇంటింటికి రేషన్‌తో రద్దుతో నియోజకవర్గంలో 50 మంది ఎండీయూలు, 50 మంది హెల్పర్లు ఉద్యోగాలు ఊడిపోనున్నాయి.

నాడు నిరుద్యోగులను యజమానులుగా

ఎండీయూ వ్యవస్థను తీసుకొచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వీటి నిర్వాహకులను వాటికి యజమానులుగా చేసింది. పేదలైన ఆపరేటర్లకు కార్పొరేషన్ల ద్వారా రుణాలు ఇప్పించారు. ఒక్కో ఎండీయూ వాహనం విలువ రూ.5,81,190 ఇందులో 10శాతం లబ్ధిదారులు బ్యాంకులకు చెల్లించగా మొత్తం సొమ్ముతో వాహనాన్ని అప్పగించారు. ఆ వాహనానికి వారే యజమానిగా ఉంటూనే ఆపరేటర్ విధులు నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ రేషన్ అందిస్తున్నందుకు వారికి నెలసరి వేతనంగా రూ.21 వేలు నిర్ణయించి ప్రభుత్వం చెల్లిస్తోంది. ఇందులో రూ.3 వేలను కట్ చేస్తూ మిగిలిన జీతం ఖాతాలకు జమచేయడం జరిగేది. రూ18 వేలతో నిర్వాహకులు వారి కుటుంబాలను పోషించుకునే వారు. ఇప్పుడు మా కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వారికి ఉపాధి కల్పించాలని వైఎస్సార్ సీపీతో పాటు వామపక్షాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఉంగుటూరు నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి

మండలం	రేషన్ దుకాణాలు	ఎండీయూలు	లబ్ధిదారులు
ఉంగుటూరు	48	16	25,653
భీమడోలు	35	13	20,962
నిడమర్రు	31	10	15,178
గణపవరం	41	11	20,223
మొత్తం	155	50	82,016

న్యాయ పోరాటానికి సిద్ధం



అగ్రిమెంట్ కాలం ఉండగానే మమ్మల్ని తొలగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అన్యాయం. మా వాహనాలకు సంబంధించి బ్యాంక్‌లలో పెండింగ్ ఉన్న బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించి, ఎన్‌ఓసీ ఇప్పించాలి. జూన్ ఒకటి నుంచి రేషన్ షాపుల ద్వారా బియ్యం సరఫరా చేస్తే న్యాయ పోరాటం చేస్తాం.

– బూసాల గణపతి, ఆపరేటర్, బువ్వనపల్లి

కుటుంబాలన్నీ వీధిన పడతాయి



ఎండీయూ సేవలను నిలిపేస్తే ఆధారపడిన మా కుటుంబాలన్నీ వీధిన పడతాయి. 2027 వరకూ అవకాశం ఉన్నా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అవస్థలు పడాల్సి వస్తుంది. గత ఐదేళ్లుగా ఇదే పనికి అలవాటు పడి జీవిస్తున్నాం. ఆపరేటర్లకు ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించకుండా ఇలాంటి నిర్ణయం తీసుకోవడం అన్యాయం. – ఇళ్ల కుమార్ బాబు, తోకలపల్లి

పేదలకు అండగా..



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి. రేషన్ దుకాణాలు కిలోమీటర్లు దూరంలో ఉండటంతో ఒక రోజు కూలి పని కోల్పోతారని ఇంటింటికి రేషన్ పథకాన్ని తీసుకువచ్చారు. ఇలాంటి మంచి పథకాన్ని ఆపేయాలనే ఆలోచన ప్రభుత్వం విరమించుకోవాలి.

– పుప్పాల వాసుబాబు, మాజీ ఎమ్మెల్యే , ఉంగుటూరు

ఊరూవాడా హనుమద్ జయంతి సందడి



గణపవరం: పిప్పరలో ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి



భీమడోలు: గుండుగొలనులో ఆకట్టుకున్న అలంకరణ



దెందులూరు: వీరభద్రపురంలో పూజలు చేస్తున్న అర్చకుడు



పెదపాడు: ఏపూరులోని దాసాంజనేయస్వామి అలంకరణ



పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయస్వామి



భీమడోలు: పూళ్లలో అశ్వవాహనంలో గ్రామోత్సవం

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

గణపవరం: హనుమద్ జయంతి సందర్భంగా గురువారం గణపవరంలోని శ్రీసువర్చలాసహిత అంజనేయస్వామివారి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో అర్చకులు కైతేపల్లి భాను, కైతేపల్లి శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో నిర్వహించిన అన్నసమారాధనలతో సుమారు నాలుగువేల మంది భక్తులు స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. జల్లికొమ్మర గ్రామ మంచినీటి చెరువ వద్ద ఉన్న భారీ అంజనేయుని విగ్రహం వద్ద హనుమద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ కురెళ్ల వెంకటరత్నం దంపతులతో పాటు పలువురు దంపతులు పీటలపై కూర్చుని సీతారాముల కల్యాణం నిర్వహించారు. పిప్పరలోని హనుమంతుని ఆలయంలో స్వామి వారిని విశేషంగా అలంకరించారు.

భీమడోలులో..

భీమడోలు: హనుమద్ జయంతి వేడుకలను ఆంజనేయస్వామి ఆలయాల వద్ద గురువారం వైభవంగా నిర్వహించారు. గుండుగొలను, పూళ్ల, భీమడోలు, సూరప్పగూడెం, ఆంజనేయనగరం, పోలసానిపల్లి గ్రామాల్లోని ఆలయాల్లోని స్వామి వార్లకు విశేష పూజలు చేశారు. గుండుగొలనులోని శ్రీసీతారామస్వామి వారి దేవాలయంలో ఉన్న ఆంజనేయ స్వామి వారికి నిత్య పూజలు చేశారు. ఆలయ ఫౌండర్ కొండా గంగరాజ్‌కుమార్ ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, తమలాపాకుల పూజలు నిర్వహించారు. పూళ్ల పడమర వీధిలోని ఆంజనేయస్వామి వారి ఆలయంలో తెలుగు అధ్యాపకులు జటావల్లభుల సాయిరామ్ హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం స్వామి వారికి అశ్వవాహనంలో గ్రామోత్సవం నిర్వహించారు. పోలసానిపల్లి పంచాయతీ పరిధిలోని ఆంజనేయనగరం వద్ద ఉన్న ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చుఏశారు. భీమడోలు సంతమార్కెట్ వద్ద ఉన్న భారీ అంజనేయస్వామి విగ్రహం ప్రత్యేక పూజలు చేశారు.



దెందులూరు: ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

ఘనంగా హనుమద్ జయంతి సందడి

దెందులూరు: మండలంలో హనుమజ్జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగాయి. గురువారం హనుమాన్ జయంతి పురస్కరించుకుని దెందులూరు సంపెంగ వారి వీధి, కొవ్వలి హైస్కూల్ వెనుక ఆంజనేయస్వామి దేవాలయం, వీరభద్రపురం ఆంజనేయస్వామి దేవాలయంతో పాటు అన్ని గ్రామాల్లో ఘనంగా హనుమద్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి వివిధ రకాల పుష్పాలతో విశిష్ట అలంకరణ అభిషేకాలు ప్రదక్షిణలు చేశారు. భక్తులు హనుమాన్ చాలీసా నిర్వహించారు. జయంతి వేడుకలు సందర్భంగా ఆలయాల ఆవరణలో అన్నదానం నిర్వహించారు.



దెందులూరు: కొవ్వలిలోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పెదపాడులో..

పెదపాడు: మండలంలోని అప్పనవీడులో హనుద్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకొనేందుకు భక్తులు బారులు తీరారు. జయంతిని సందర్భంగా స్వామి వారి లడ్డూ ప్రసాదాలను వేలం వేసారు. 25కేజీల లడ్డూని మేకా సత్యన్నారాయణ 20,500లకు, చండిగ శివుడు 14కేజీల లడ్డూని రూ.21500లు, 18కేజీల లడ్డూని రూ.10వేలకు వేమూరి శ్రీనివాసరావులు దక్కించుకున్నారు. గ్రామ శివారున భారీ అన్న సమారాధన లారీ ఓనర్స్ అసోషియేషన్ అధ్యక్షుడుడ రాజు గారు ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. వివిధ రకాల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఏపూరు ప్లైఓవరు సమీపంలోని సీతారామ దాసాంజనేయస్వామి ఆలయంలో 75వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామికి అష్టోత్తర శతనామావళి, శతకలశ అభిషేకం, విశ్వక్సేన పూజ, వాసుదేవ పుణ్యాహవచనం ఉదయం 8గంటలకు సామూహిక సహస్ర నాగవల్లి దళార్చన, తమలపాకుల పూజలు నిర్వహించారు. సాయంత్రం 7గంటల నుంచి భజన కార్యక్రమం నిర్వహించారు. పల్నాటి సత్యన్నారాయణ, చోడే వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



గణపవరం: సువర్చలాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రభుత్వ కళాశాలలో కార్పొరేట్ ఫలితాలు



సత్ఫలితాలు సాధించిన విద్యార్థుల చిత్రాలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన ఉపాధ్యాయులు

దెందులూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఫలితాలు సాధించాలని దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాల కళాశాల హెచ్ఎం మల్లికార్జున రావు పేర్కొన్నారు. కళాశాలలో సత్ఫలితాలు సాధించిన విద్యార్థుల చిత్రాలతో కళాశాల ఎదుట ఫ్లెక్సీలు పాఠశాల గ్రంథ పాలకులు గొల్లపూడి వెంకటేశ్వరరావు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ దెందులూరుతో పాటు మండలాల విద్యార్థులు దెందులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు పొందాలన్నారు. ఎంపీసీ, బైపీసీ కోర్సులు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణ, లావణ్య, కల్యాణి, పల్లారెడ్డి, బాలాజీ, సాయిరాం, లోవరాజు అన్నారు.

బాలుడి మృతి

దెందులూరు: దోసపాడు గ్రామంలో బాలుడు పందికొక్కులకు పెట్టే మందు తిని చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ ఆర్. శివాజీ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దోసపాడులో చేపల చెరువు వద్ద బుధవారం మేత కడుతుండగా చెరువు గట్టుపై మాగబత్తిన అఖిల్ బాబు వాంతులు చేసుకోవడంతో తండ్రి గమనించాడు. చెరువులో నుంచి వెంటనే గట్టు మీదకు వచ్చి ఎందుకు వాంతులు అవుతున్నాయని ప్రశ్నించడంతో పందికొక్కులకు పెట్టే మందు తిన్నానని అఖిల్ చెప్పడంతో వెంటనే అతన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దళితులపై పెరిగిపోతున్న దాడులు



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (టూటౌన్): రోజురోజుకు దళితులపై కుల వివక్ష దాడులు పెరిగిపోతున్నాయని కేవీపీఎస్ ఏలూరు జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ ఆవేదన వ్యక్తం చేశారు. కేవీపీఎస్, దళిత ప్రజా ఎస్సీ ఎస్టీ సంఘాల ఆధ్వర్యంలో స్థానికంగా గురువారం నిర్వహించి రౌండ్ టేబుల్ సమావేశానికి ఏబీఆర్ఎఫ్ రాష్ట్ర నాయకురాలు ఆర్ మణిసింగ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఫ్రాన్సిస్ మాట్లాడుతూ రాష్ట్రంలో దేశంలో 2014 నుంచి బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దళితులపై కుల వివక్ష దాడులు పెరిగిపోయాయన్నారు. హైదరాబాద్ యూనివర్సిటీలో రోహిత్ కుల హత్య, ఇటీవల తిరుమల తిరుపతిలో బీటెక్ థర్డ్ ఇయర్ విద్యార్థి జేమ్స్‌పై దాడి ఘటనలను గుర్తుచేశారు. జేమ్స్‌ను కులం పేరుతో దూషిస్తూ అత్యంత దుర్మార్గంగా దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దళితుల వ్యతిరేక ప్రభుత్వంగా ఉందని, దళిత ఎస్సీల పట్ల నిర్లక్ష్యం వీడాలని వక్తలు ముక్తకంఠంతో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో నేతల రమేష్ బాబు, ఎరికిపాటి విజయ్ కుమార్, మత్తే బాబి, ఎం ఇస్సాక్, కాపుదాసి రవి తదితరులు పాల్గొన్నారు.

21 వరకు యోగా తరగతులు

ఏలూరు (టూటౌన్): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా యోగా శిక్షణా తరగతులు ఈ నెల 21 నుంచి వచ్చే నెల 21 వరకు నిర్వహించనున్నట్టు ఏలూరు నగర పాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యం ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించే యోగా తరగతులకు ఆసక్తి ఉన్న వారంతా హాజరుకావాలని కోరారు.

యోగా, ధ్యానంతో రక్తపోటు నుంచి ఉపశమనం



పీహెచ్‌సీలో అధిక రక్తపోటుపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కిరణ్మయి

గణపవరం: గర్భిణులు అధికరక్తపోటుపై అప్రమత్తంగా పూర్తి అవగాహనతో ఉండాలని, రక్తపోటు నుంచి ఉపశమనానికి యోగా, ధ్యానం తప్పనిసరిగా చేయాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.కిరణ్మయి అన్నారు. గురువారం ప్రపంచ ఎక్లమీసియా (గుర్రపువాతం) దినోత్సవం సందర్భంగా గణపవరం పీహెచ్‌సీలో గర్భిణులకు అధికరక్తపోటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికరక్తపోటు ఉన్న గర్భిణులు తప్పనిసరిగా ప్రతితీ రోజూ యోగా, ధ్యానం చేయాలని సూచించారు. వారంలో కనీసం ఐదురోజులపాటు రోజుకు 30 నిమిషాలు వాకింగ్ చేయాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యుడు ఓంకార్‌నాథ్ మాట్లాడుతూ గుర్రపు వాతం ఐదు నెలలు నిండిన గర్భిణులకు వచ్చే అవకాశం ఉందని, వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జాలాది విల్సన్, పీహెచ్‌ఎన్ సత్యవతి, హెచ్‌వీ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నింటికీ కూటమి సర్కార్ చరమగీతం

భీమడోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నింటిని అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తామని హామీ ఇచ్చిన నారా చంద్రబాబు నాయుడు వాటిని రద్దు చేయడం, ప్రజలను మోసం చేయడమేనని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి సర్కార్ ఇంటింటికీ రేషన్ విధానాన్ని ఎందుకు రద్దు చేశారు? అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి ఏడాదైన అమ్మ ఒడి, ఫ్రీ బస్ స్కీమ్, మహిళలకు నెలకు రూ.1500 వంటి సంక్షేమ పథకాలు అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు.

పర్యావరణ పరిరక్షణతోనే జీవవైవిధ్యం సాధ్యం



సామూహిక పుస్తక పఠనం చేయిస్తున్న జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ టీవీ ఉమామహేశ్వరరావు

భీమడోలు: పర్యావరణ పరిరక్షణతోనే జీవవైవిధ్యం ముడిపడి ఉందని, సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన తరగతులు 21వ రోజైన గురువారం ఉత్సాహంగా సాగాయి. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ తరగతుల్లో అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పూళ్ల, గుండుగొలను గ్రంథపాలకులు డీఎన్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఎండీయూ ఆపరేటర్ల వినతి



నిడమర్రు తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న మండల ఎండీయూ ఆపరేటర్లు

నిడమర్రు: 72 నెలల అగ్రిమెంట్ కాలంతో విధుల్లో చేరిన ఎండీయూ నిర్వహకులకు ఇంకా ఒకటిన్నర సంవత్సరం ఉండగా తొలగించడం దారుణమని నిడమర్రు మండల ఎండీయూ ఆపరేటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం మండంలోని పలువురు ఎండీయూ ఆపరేటర్లు నిడమర్రు తహసీల్దారు నాగరాజుకు ప్రభుత్వ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, బ్యాంకులను నుంచి ఎన్‌ఓసీ ఇప్పించాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎండీయూ ఆపరేటర్ దాసిరి ఏసు మాట్లాడుతూ 2027 జనవరి వరకూ అగ్రిమెంట్ ఉన్నా ప్రభుత్వం తొలగించడంతో నియోజకవర్గంలో 100 మంది చిరుద్యోగులు ఉపాధి కోల్పోనున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకటిన్నర సంవత్సరం అగ్రిమెంట్ కాలం ఉండగా తొలగించడం అన్యాయమని, బ్యాంకుల వద్ద తమ వాహనాలపై ఉన్న బకాయిలను వెంటనే చెల్లించి ఎండీయూ ఆపరేటర్లందరికీ ఎన్‌ఓసీ సర్టిఫికెట్స్ అందజేసిన తర్వాతే డీలర్లతో సరుకులు పంపిణీ చేసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పెద్దిరాజు, శ్రీను, షరీఫ్, అనీల్, దుర్గారావు, హరిబాబు తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మహిళలు, బాలికల రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు సూచించారు. ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం - టోల్ ఫ్రీ నెంబర్లపై ఏలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో విద్యార్థులకు గురువారం ఆయన శక్తి టీమ్ సభ్యుల తో కలిసి అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు.